మూడో విడత ధాన్యం కొనుగోలులో నగదు రూ.193 కోట్లు జమ

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హర్షం

విశాలాంధ్ర -విజయనగరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలులో రైతులకు మూడో విడతగా నగదు ఖాతాలో జమ చేసిన సందర్భంగా విజయనగరం జిల్లా రైతులకు 193 కోట్లు రైతుల ఎకౌంట్లో జమ అయిన నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

జగన్మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు పెద్దపీట

డిప్యూటి స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరంటౌన్:రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ అన్ని రంగాలలో బీసీలకు పెద్దపీట వేశారని అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. తిరుపతి కలితీర్థం సమీపంలోని శ్రీవారి సన్నిధిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్. జగన్మోహన్రెడ్డి ఎస్‌సి, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన సముచిత స్థానం ఏ రాజకీయ నాయకుడు కల్పించలేదన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో బీసీలతో పాటు ఏ వర్గానికి ఏమిచేసిన పాపానపోలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు చంద్రబాబును విస్మరించి దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఏ నాయకుడికి ఇవ్వనన్ని సీట్లు, ఓట్లు ఇచ్చారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న అధికార దాహంతో చంద్రబాబు లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నాడన్నారు. లోకేష్ పాదయాత్ర కు ప్రజాదరణ కరువై లోకేష్‌కు వాకింగ్‌గా ఉపయోగపడుతోందన్నారు. ఎప్పుడూ.. చంద్రబాబు సొంతంగా పోటీ చేసే ధైర్యం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు పవన్ కళ్యాన్ పొత్తు పెట్టుకున్నా, బిజేపి నుంచి కన్నా టిడిపి కి వెళ్లిన ఒరిగిందేమీ లేదని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

ఇద్దరు వ్యక్తులపై కేసునమోదు

విశాలాంధ్ర-వేపాడ: అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలంలోని రైవాడ రిజర్వాయర్ నుంచి ఇసుకను ట్రాక్టర్ ద్వారా, వేపాడ మండలాని అక్రమ రవాణా చేపడుతున్న ట్రాక్టర్ ని వల్లంపూడి పోలీసులు పట్టుకొని, కేసు నమోదు చేశారు., ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణా జోరందుకోవడంతో ఆరోపణలు అధికమయ్యాయి. దీనిపై స్పందించిన పోలీసులు అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపేందుకు నడుం బిగించారు. ఇసుక అక్రమ రవాణాపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన వాళ్ళం కూడా ఎస్సై కే రాజేష్ మాటువేసి మండ లానికి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టాక్టర్ను పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ఏ విధమైన అనుమతులు లేక ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా పై దృష్టి సారించడం జరుగుతుందని రవాణా చేసేవారు ఎంతటి వారైనా ఘటించారు హెచ్చరించారు. కొంతమంది వ్యాపారులు ఇసుక రవాణాని ఎంచుకొని ట్రాక్టర్ ద్వారా, వేపాడ మండలానికి తరలించు కుంటూ అమ్మకాలు జరుపు కుంటూ కాసులు కళ్ళ చూస్తున్నారు.

దీర్ఘకాల పన్నుల వసూళ్లలో ఉపేక్షించేది లేదు

సహాయ కమిషనర్ ప్రసాద రావు హెచ్చరిక

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: దీర్ఘకాల పన్ను వసూళ్ళ విషయంలో ఉపేక్షించేదిలేదని సహాయ కమిష నర్ ప్రసాదరావు హెచ్చరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడటంతో మొండిబకాయలను వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పన్ను బకాయిలపై ఆరా తీస్తూ, మొండి బకాయి దారుల వద్దకు వెళ్లారు.పూల్ బాగ్ తదితర ప్రాంతాలకు వెళ్లి పన్ను కట్టాల్సిందేనని చెప్పారు. దీర్ఘకాల పన్నుదారులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చినా స్పందించని వారి ఆస్తులు జప్తు చేయడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ 2022 - 23 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడడంతో పన్ను వసూలకై ప్రత్యేక కార్యచరణ చేపట్టామన్నారు. సచివాలయాల వారీ బృందాలుగా ఏర్పాటై పన్ను బకాయిలను రాబట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 43 కోట్ల 49 లక్షల 26 వేల రూపాయలు పన్ను వసూళ్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.24.58 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. మిగిలిన పన్నులు త్వరితగతిన వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు, పన్ను బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఆస్తి పన్ను, కులాయి పన్ను, ఖాళీ స్థలముల పన్నులను త్వరగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవే రోటరీ లక్ష్యం

అధ్యక్షులు జెసి రాజు

విశాలాంధ్ర -బొబ్బిలి: సామాజిక సేవే లక్ష్యం గా చేసుకొని రోటరీ ప్రపంచ వ్యాప్తం గా సేవలు అందిస్తున్నదని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు అన్నారు.గురువారం స్థానిక విద్యావనరుల కేంద్రం వద్దగల భవిత కేంద్రంలో రోటరీ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భవితలో శిక్షణ తీసుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు లకు పలకలు, పండ్లు, రొట్టె మిఠాయిలు రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీహరి, జి.శ్రీనివాసరావు, కె రామ కృష్ణ, జి.శంకర రావు, జి.కిరణ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ సేవే పరమార్ధంగా సేవలందించే అంతర్జాతీయ రోటరీ సంస్థ ఆవిర్భావదినాన్ని దివ్యాంగుల పిల్లల మధ్య నిర్వహించటం సముచితంగా ఉందన్నారు. బొబ్బిలి ,పరిసర ప్రాంతాలలో రోటరీ సంస్థ అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది అనిత, ప్రమీల, విద్యావనరుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాడంగిలో పాఠశాల సముదాయ సమావేశం

విశాలాంధ్ర- బాడంగి/ తెర్లాం: జెడ్పీ ఉన్నత పాఠశాల బాడంగిలో కాంప్లెక్స్ చైర్మన్ సిద్ధాంతం త్రినాథరావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి మండలాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గల సైన్స్ ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ సమావేశంలో లెసన్ ప్లాన్, బైజూస్ టాబ్స్ వినియోగం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక భోదన, పదో తరగతి విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించడం, వీటితో పాటు ప్రతీ టీచర్ విద్యా ర్థులకు నాణ్యమైన భోదన అందివ్వాలంటే నూతన భోదనా పద్ధతులు పాటిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతకు దారితీసేలా భోదన ఉండాలని, ప్రాథమిక స్థాయిలో తర్ల్, ప్రాథమికోన్నత స్థాయిలో లిప్ అమలుచేయాలని మెరుగైన అభ్యసన అభివృద్ధితోనే విద్యార్థులలో జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందని, ఉపాధ్యాయులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారుచేసి భోదనచేయాలనీ, కార్యక్రమం లో రెండు మండలాల నుండి 70మంది సైన్స్ టీచర్స్ హాజరయ్యారు. రీసోర్స్ పర్సన్‌గా ఎస్ఎస్ఎం రమేష్ వ్యవహరించారు.

రాష్ట్ర పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలి

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంత్రత్వ విధానాలను, ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులను తెలియజేయడంతో పాటు టీడీపీ రాష్ట్రానికి అవసరమన్న విషయాన్ని ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ కేంద్రమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. అశోక్ బంగ్లాలో గురువారం టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వేపడ చిరంజీవిరావు గెలుపుకు తీసుకోవలసిన చర్యలపై నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఓటరుగా ఉన్న ప్రతిఒక్కరి వద్దకు వెళ్లి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాను వారికి వివరించి, టీడీపీ అభ్యర్థి విజయం రాష్ట్రానికి ఇప్పుడు ఎంత అవసరమో తెలిసేలా వారిని చైతన్య పరిచాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో గల రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, పట్టణ, మండల స్థాయి నాయకులు, వార్డు, గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్, ఎంపిటిసి, సర్పంచులు, అభ్యర్థులు క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావుని గెలిపించండి

పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుని పట్టభద్రులంతా ఓటువేసి గెలిపించాలని శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. శృంగవరపుకోట మండలములోని శృంగవరపుకోట, వినాయకపల్లి, తిమిడి, ఆలుగుబిల్లి, గోపాలపల్లి, ఎస్.కోట తలారి, సీతారాంపురం, తెన్ను బొడ్డవర, కృష్ణాపురం గ్రామాలలో నిరుద్యోగ పట్టభద్రులను మాజీ ఎమ్మెల్యే కలిసి గురువారం కరపత్రాలను అందజేశారు. అనంతరం పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ ప్రభావ శీల సంస్థలు, వ్యక్తులు, మండల స్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంఛార్జ్ లు, యూనిట్ ఇంఛార్జ్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్ లు, ఇతర ముఖ్య పదవుల్లో ఉన్నవారంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి పట్టభద్రుల ఓటర్ ని కలసి పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందేలా సమిష్టి కృషి చేయాలని ఆదేశించారు. పర్యటనలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమనాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, ఎంపీటీసీ రాయ వరపు చంద్రశేఖర్, ఐటీడీపీ నాయకులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, పలు గ్రామాల నాయకులు ఉన్నారు.

అనుమతులు లేని వాటర్ ప్లాంట్లపై దాడులు

విశాలాంధ్ర-దత్తిరాజేరు: ఆర్డిఓ ఆదేశాల మేరకు తాహసిల్దారు రమేష్ ఆధ్వర్యంలో మండలంలో గల దత్తిరాజేరులో గల ఆక్వా జెల్‌ప్లాంట్, దత్తిగ్రామంలో గల శ్రీ సూర్యవాటర్ ప్లాంట్ సంతతోటలో ఆర్ ఓ ప్లాంట్ లపై జాయింట్ ఇన్స్పెక్షన్ టీం సభ్యులు, ఫుడ్‌సేఫ్టీ అధికారి కావ్యారెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ లీగల్ మెట్రా లజీ బలరామకృష్ణ తో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ఇచ్చి నెంబర్, ఐఎస్ఐ సర్టిఫికేట్, ప్యాకింగ్ యూనిట్స్ కి సంబంధించిన లైసెన్సు, ఎటువంటి అనుమతులు, ఆధారాలు లేవన్నారు. దీని నివేదిక ను బొబ్బిలి డివిజన్ ఆర్ డి ఓ కు సమర్పించి వారి ఆదేశాలు మేరకు చర్యలు తీసుకోబడుతుందన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు దేహదారుఢ్యానికి, సమయస్ఫూర్తికి దోహదం

నగర డిప్యూటీ మేయర్ శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ఆత్మరక్షణ క్రీడలు దేహదారుఢ్యానికి, సమయస్ఫూర్తికి ఎంతగానో ఉపయోగపడతాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. 5వ జాతీయస్థాయి తైక్వాండో క్యాడేట్ పోటీ లకు గాను 12 మంది క్రీడాకారులు ఎంపిక కావడంతో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాకారులకు ఆమె అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో కేడెట్ విభాగం నుంచి 12 మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతైనా అభినందనీయమన్నారు. అలాగే విజయనగరం జిల్లాకు రాష్ట్రస్థాయి పోటీలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం కూడా ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈనెల 24 నుంచి 28 వరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే 5వ జాతీయ స్థాయి క్యాడే ట్ పోటీలలో వీరు పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో పోటీలలో కూడా విజయనగర ఖ్యాతిని మరింత ఇనుమడింప చేయాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డి.వి. చారి ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు చక్కటి ప్రతిభను కనపరచి జాతీయస్థాయి పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకాలు సాధించిన వారిలో మహిళా విభాగం లో వి.హిమశ్రీ, పి.లాస్య, ఎం.రేణుక, పి.షణ్ముఖ ప్రియ, బాలుర విభాగంలో టి. వరుణ్ కుమార్, పి.వి. ఎం. జస్వ కె. రోహిత్ కుమార్, కే ఎస్ జి వెంకటాద్రి, ఐ .లక్ష్మీ దత్, కే.సాయి కిషోర్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు రవికుమార్, వినీష్ లు కూడా పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వున్నతమైన ఆలోనలతో వుండాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి: మండలం మెట్టపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం. జీవిత లక్ష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ విద్యార్థులు తదువుమీద దృష్టి పెట్టాలని, నిశ్చయమైన అలోచనలతో మీ మన సమస్సును ప్రభావితం చేయడం మీరు విజేతలు అవుతారని అన్నారు. అలాగే చెడు వ్యసనాలకు భానిస కాకుండా మంచి పుస్తకాలను చదవటంవల్ల మీలో మేధోశక్తి పెరుగుతుంది అలాగే నిరంతరం కష్టపడి తత్వం వుండాలని, పరీక్షల సమయంలో ఆరోగ్యాని కాపాడుకోవాలని మంచి లక్ష్యంతో విజయం సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు కైరియర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో, హెచ్ఎం, ఉపాధ్యాయులు జనార్దన్, బీఆర్ అంబెద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బో.కిశోర్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షక పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అదునూనత సాంకేతిక పరికరాలతో చేపడుతున్న భూ సమగ్ర రీసర్వే ద్వారా సర్వహక్కులు రైతులు పొందవచ్చని రైతుల సద్వినిగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జగనన్న శాశ్వత భుహక్కు భూ రక్షక పథకంలో భాగంగా అధునూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ ద్వారా చేపట్టిన డ్రోన్ భూ రీసర్వే గురువారం మండలంలోని పక్కి గ్రామ రెవెన్యూలో తహశీల్దార్ రాజారావు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే శంబంగి హాజరై డ్రోన్ల ద్వారా చేపట్టిన సర్వేను ప్రారంభించారు.

ఎల్లారమ్మ జాతరకు చురుగ్గా ఏర్పాట్లు

విశాలాంధ్ర-జామి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు జామి శ్రీ ఎల్లారమ్మ జాతర ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనుంది. ఎంతో ప్రఖ్యాతి గాంచిన ఈ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అటు దేవాదాయ శాఖ ,ఇటు ఆలయ ఉత్సవ నిర్వహి నిర్వాహక కమిటీ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారి ఆలయాన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలను అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం సక్రమంగా జరిగేలా భారీకేడ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత దర్శనాన్ని కూడా ఏర్పాటు చేశామని ఈవో ఎం ప్రసాదరావు తెలిపారు. జాతర నేపథ్యంలో 26న రాత్రి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మరోవైపు అమ్మవారు ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై జి .వీరబాబు తెలిపారు. జాతరలో జేబుదొంగలు సంచారం ఎక్కువగా ఉంటుంది కనుక భక్తులు విలువైన ఆభరణాలను ధరించవద్దని కోరారు. మూడు రోజుల జాతర కారణంగా గ్రామములో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు , అపారిశుద్యం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు.

మడ్డువలస డ్యాంలో నేటి నుండి చేపలవేట నిషేధం

విశాలాంధ్ర-వంగర: శుక్రవారం నుండి మడ్డువలస డ్యాంలోచేపలవేట నిషేధం విధించారు. ఈ మేరకు కొట్టిశ సొసైటీకి మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు. జారీచేశారు. మడ్డువలస డ్యాం లీజు సొమ్ము చెల్లించేవరకూ శుక్రవారం నుండి డ్యాంలో చేపలు వేటచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మత్స్యశాఖ అధికారులు నోటీసులుజారీచేశారు. ఈ మేరకు మడ్డువలసలో అక్రమంగా చేపలు వేటను నిషేధించాలని మత్స్యశాఖ అస్సిటెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్‌వి ప్రసాద్ అన్నారు. ఈ డ్యాంలో చేపలవేటను నిలుపుదలచేయాలని తమకు నోటీసులు జారీచేశారని వంగర మండలం కొట్టిశ శీతరామ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులతో సమావేశమై లీజు నిధులు రూ.22 లక్షల రూపాయలు వరకూ చెల్లించి వేటను కొనసాగిస్తామని తెలియజేశారు.

శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: విశాలాంధ్ర కుటుంబ సభ్యుడు, పార్వతీపురం గ్రామీణ విలేకరి జన్నేటి శ్రీనివాసరావు మృతిచెందారన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే సదుద్దేశంతో పార్వతీ పురంలోగల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతి నిధులు తలో చేయి వేసి రూ. 40 వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి గురువారం అందజేశారు. అనంతరం వారు ఆ కుటుంబాన్ని ఓదారుస్తూ శ్రీనివాసరావు ఒక మిత్రుడుగా, ఒక అన్నదమ్ముడుగా ఉండేవాడని ఆయన మృతి మా పార్వతీపురం మీడియా మిత్రులకు తీరని లోటన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి భవిష్యత్తులో ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా మా వంతు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన వనంగుడి ప్రతిష్ట

విశాలాంధ్ర -కురుపాం: కురుపాం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి వనంగుడి ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్, అనిత దంపతులు శాస్త్రోక్తంగా అవ గాహన పూజలు, హోమం చేపట్టారు. శుక్రవారం ఉదయం పైడితల్లి అమ్మవారి విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ట చేయనున్నారు. ఈకార్యక్రమంలో కురుపాం పరిశర ప్రాంతాల్లో ప్రజలు ,వైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కోట రవీంద్ర కుమార్, వర్తకసంఘం అధ్యక్షులు బరాటం గుంపస్వామేశ్వరరావు, జడ్పీటీసీ సుజాత, సర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వాణిజ్య విభాగ అధ్యక్షులు గా అంధవరపు..

విశాలాంధ్ర-కురుపాం: మాజీ జడ్పీటీసీ ,కళింగ వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు ను పార్వతీపురం మన్యంజిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఅధిష్టానం నియమించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కల్పించిన ఈ అవకాశం తో పార్టీ అభివృద్ధి కి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు పదవి కల్పించిన ఎమ్మెల్యే పాముల. పుష్పశ్రీవాణికి ధన్యవాదాలు తెలిపారు. పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఓపెన్ ఇంటర్ లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-పాలకొండ: 2022-23 విద్యాసంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఓపెన్ ఇంటర్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూలింగ్ సొసైటీ ఏపీవోఎస్ఎస్ వారి ఆదేశాల మేరకు పదవ తరగతి పాసై ఖాళీగా ఉన్న విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లేదా రెండో సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్లో ప్రవేశానికి అర్హులు అని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ ప్రవేశాలకు ఆఖరు తేది ఈనెల 27వ తేదీ ఆసక్తిగల అభ్యర్థులు తమ పదవ తరగతి పాస్ సర్టిఫికెట్ ఆధార్ కాపీ, 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని కళాశాల ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

విద్యాభోధన బేస్ ఎంపీడీవో గీతాంజలి

విశాలాంధ్ర-సీతంపేట: మండలం గుమ్మడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయురాలు భూదేవి అందిస్తున్న విద్యాబోధన విద్యార్థులకు సులభతరంగా పాఠాలు చదవడం, రాయడం నేర్పించిన విధానం చాలా బాగుందని ఎంపీడీవో గీతాంజలి కితాబ్ ఇచ్చారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే రీతిలో విద్యా అందించడం ద్వారా వారి యొక్క చదువు మెరుగుపడుతుందని ఉపాధ్యాయులు విద్యార్థులతో ఫ్రెండ్లీగా ఉండటం చాలా సంతోషమని ఎంపీడీవో తెలిపారు.

ప్రతి కుటుంబాన్ని వైసీపీకి అనుసంధానం చేయడమే గృహసారధుల లక్ష్యం

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నియోజకవర్గంలోనే ప్రతి కుటుంబాన్ని వైసిపి ప్రభుత్వానికి అనుసంధానం చేయడమే లక్ష్యంగా గృహసారదులు పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. గురువారం మున్సిపాలిటీలోని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు కార్యకర్తలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై వచ్చే నెల 18వ తేదీ నుంచి గృహ సారథులు ఇంటి ఇంటికి వెళ్లి నిర్వహించబోయే "జగన్ అన్నే మా భవిష్యత్తు" ప్రచార కార్యక్రమం నిర్వహణపై అనుసరించాల్సిన విధి విధానాలపై వారికి వివరించారు. సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు మీ పరిధిలో గల ప్రతీ ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటుగా ప్రత్యేకంగా వారికి ఈ మూడన్నరేళ్ళ కాలంలో అందచేసిన సంక్షేమ పథకా లను వివరించి ప్రతీ కుటుంభం నుంచి ప్రజల పూర్తి మద్దతు కోరాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్ జే దివ్య, స్థానిక కోఆప్షన్ సభ్యులు గుంట క్రాంతి, ఏం సి డైరెక్టర్ గోగు గాయత్రి, వైసీపీ సీనియర్ నాయకులు బి ఆదినారాయణ, జీ బాల మురళీకృష్ణ, ఏం తవిటి నాయుడు, ఆయా వార్డుల సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కింజరాపు ఎర్రన్నాయుడు 66వ జయంతి

విశాలాంధ్ర-బెలగాం: అనునిత్యం ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించిన ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 66వ జయంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఢిల్లీ స్థాయికి ఎదిగి ప్రజల గుండెల్లో నిల్చిన నాయకుడని, తన కంచు కంఠంతో చట్టసభలలో తెలుగు ప్రజావాణిని బలంగా వినిపించిన ఎర్రన్న స్ఫూర్తితో మనమంతా ప్రజాసమస్యలపై పోరాటానికి పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహన్, టిడిపి సీనియర్ నాయకులు కోలా వెంకట్రావు (బాబు), గొట్టాపు వెంకటనాయుడు, జి.రామ్మూర్తి, టిడిపి మునిసిపల్ కౌన్సిలర్లు తాతపూడి వెంకటరమణ, బడే గౌరినాయుడు, నాయకులు కెవిజిఎస్ ప్రదీప్, కోలా మధు జాగాన రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.డి.జి లక్ష్యాలు సాధించాలి

డిఎంహెచ్ఓ జగన్నాధరావు

విశాలాంధ్ర-పార్వతీపురం/ బెలగాం: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్.డి.జి) ను అధిగమించే దిశగా వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. గురువారం పట్టణంలోని గిరిజన సామాజిక భవనంలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై కొమరాడ, కె.ఆర్.బి.పురం, మాదలంగి, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, దుడ్డికల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎఎన్ఎంలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, ఐదు సం.లోపు పిల్లలు, కిశోర బాలికలలో రక్తహీనత నివారణపై దృష్టి సారించాలని, చిన్నారుల్లో పౌష్టికాహారం లోపం, ఎదుగుదల లోపం ఉన్నవారిని గుర్తించి వీటిని అదిగిగమించాలని పేర్కొన్నారు. రక్త హీనత, పౌష్టికాహార లోపాలు అధిగ మించినపుడు ఎస్.డి.జి లక్ష్యాలను సాధించగలమని సూచించారు. గర్భిణీలను త్వరగా గుర్తించి నమోదు చేయడం, వెంటనే అవసరమైన పరీక్షలు చేసి హై రిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రక్త హీనత నివారణకు కొత్తగా సూచించిన మందులను షెడ్యూల్ ప్రకారం వేసుకునేలా చూడటం, అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకోవడం, ప్రసవానికి ముందుగానే బర్త్ ప్లానింగ్ చేసి నిర్దేశించిన రిఫరల్ ఆసుపత్రిలో చేర్పించడం మొదలగు అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఐదు సం.లోపు పిల్లల్లో క్రమం తప్పకుండా ఐరన్ సిరప్ లను వేయడం, సామ్, మామ్, స్టంటెడ్ గ్రోత్ పిల్లలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పది నుండి 19 సం॥ల బాలికల్లో హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనతను గుర్తించాలని, ఐరన్ మాత్రలు వేయిం చడం, పోషకాహారంపై అవగాహన కల్పించడం, యుక్త వయస్సు వివాహాల వల్ల కలిగే అనారోగ్య సూచనలపై అవగాహన కల్పించడం చేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్, ఎన్.సి.డి సర్వే, లెప్రసీ సర్వే, సీజనల్ వ్యాధులు మొదలగు కార్యక్రమాలపై సమీక్షచేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునై జేషన్ అధికారి టి.జగన్మోహనరావు, ఎపిడిమి యాలజిస్ట్ నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి వినోద్, డిపిఒ లీలారాణి, సిబ్బంది శంకర్, మణిమాల, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆలగురువు లో జీడి మామిడి తోటలపై అవగాహన



విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో గురు వారం ఆలగురువు గ్రామంలో రైతులకు జీడి మామిడి తోటల పైన అవగాహన సదస్సు ఉద్యానశాఖ అధికారిని ప్రత్యూష భాను నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పూతదశలో పూతకు ముందు దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఉద్యాన అధికారులు రైతులకు తెలియజేశారు. జీడి మామిడి తోటలో కొమ్మల కత్తిరింపు ఏ విధంగా చేయాలి పూతదశలో పూతనిలబడడానికి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాల గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు విహెచ్ఎ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.113కోట్ల జమ

విశాలాంధ్ర-పార్వతీపురం : ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలో 12,913 మంది రైతులకు రూ.113 కోట్లు జమచేసినట్లు జిల్లా కలెక్టరు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను 44,870 మంది రైతులనుండి కొనుగోలు చేశారు. రైతులకు మొత్తం రూ.418 కోట్లు చెల్లించాల్సిఉండగా గురువారం చెల్లించిన రూ.113 కోట్లుతో కలిపి జిల్లాలో ఇంతవరకు రైతులకు రూ.416 కోట్లను జమ చేసినట్లు తెలిపారు.

ఉగాది నాటికి 5 లక్షల గృహాలు

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి. లక్ష్మీషా

విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్రంలో ఉగాది నాటికి 5 లక్షల గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీషా అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 2.82 లక్షల గృహాల నిర్మాణం పూర్తి అయ్యాయని రూఫ్ స్థాయి, రూఫ్ పూర్తి స్థాయిలో 3 లక్షల గృహాలు ఉన్నాయని, ఇప్పటికే ప్రారంభం కాని గృహాల నిర్మాణం వెంటనే ప్రారంభించుటకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాది చివరి నాటికి 10 లక్షల గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉన్నామని, పార్వతీపురం మన్యం జిల్లాలో 13,790 గృహాలు ఉగాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికీ 8 వేల గృహాలు పూర్తి అయ్యాయని, 60 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన గృహాలు వివిధ దశలలో ఉన్నాయని వివరించారు. జిల్లాకు మొత్తం 24,580 గృహాలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు గృహాలు కల్పించాలని నిధులు మంజూరు చేస్తున్నాయని అన్నారు. అన్ని కాలనీల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జేసీ ఓ. ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామ చంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఐటిడిఏ ప్రాంతంలో గిరిజనుల ఇళ్లను ప్రభుత్వమే నిర్మించాలి

విశాలాంధ్ర-బెలగాం/కురుపాం: పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ఇల్లును మంజూరు చేసినప్పటికీ వారు కట్టుకు నేందుకు ఆర్థిక స్తోమత లేక కట్టుకోలేకపోతు న్నారని వారందిరికీ పట్టణ ప్రాంతంవలే ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, అలాగే ఇల్లు మంజూరు కాని వారందరికీ ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండి లక్ష్మీషాను గిరిజన అభ్యుద య సంఘం తరుపున కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయ కులు దుక్క సీతారాం, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కామయ్య బంధను కబ్జాదారుల చెర నుంచి కాపాడాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం: మున్సిపాలిటీ పరిధిలో సర్వే నంబర్ 337లో ఉన్న ప్రభుత్వ భూమి కామయ్య బంధను కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సంగం డిమాండ్ చేశారు. వివిధ వార్తా పత్రికల్లో కామయ్య బందపై కథనాలు వస్తున్న నేపథ్యంలో గురువారం ఆయన మాట్లాడారు. సుమారు 13.57 ఎకరాల విస్తీర్ణం కలిగిన కామయ్య బందలో ఒక ఎకరా భూమిని కబ్జాదారులు ఆక్రమించి అమ్మకాలు చేస్తున్న ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం అందిందని తెలిపారు. దీనికి సంబంధించి వివిధ పత్రికలో కథనాలు కూడా వెలువడ్డాయని అన్నారు. న్యాయ స్థానం ఈ భూమిని 2007లో ప్రభుత్వ భూమిగా గుర్తించి తీర్పు కూడా వెలువరించిందని, అయినా ఆక్రమణదారులు రెచ్చిపోతు అమ్మకాలు చేస్తున్నారని మండిపడ్డారు. కావున కామయ్య బంధ కబ్జాదారుల చెర నుంచి కాపాడి పేదలకు గాని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు గాని వినియోగించాలని కోరారు. పాలకొండ మండల కార్యదర్శి బి.వెంకటరమణ, అజ్జరాపు దాము, తదితరులు పాల్గొన్నారు.

సిసి రహదారి పనులు ఐటీడీఏ పిఓ విష్ణుచరణ్ తనిఖీ

విశాలాంధ్ర-కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలంలో సిసి రహదారులు, కాలువలు, వరద నివారణ కరకట్టల పనులను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ తనిఖీ చేశారు. కురుపాం మండలం మంతినివలస, నేరేడు వలస గ్రామాలు, గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గూడ, కేసరి గూడ కొండ శిఖర గ్రామాలను సందర్శించారు. పనుల నాణ్యతలో రాజీ ఉండరాదని ఆయన పేర్కొన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు ఉండాలనిఆదేశించారు.

జీసిసి గోడౌన్ పరిశీలన

గిరిజన సహకార సంస్థ గిడ్డంగులు, ఎం.ఎల్.ఎస్ పాయింట్లు, గ్యాస్ గోడౌన్, జీసిసి పెట్రోల్ బంక్ లను ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. వాటి నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజనులకు మేలు జరగాలని ఆయన పేర్కొన్నారు. అటవీ ఫలసాయం కొనుగోలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు లాభదాయకత ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి. మహేంద్ర కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిఇ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై నిఘా పెంచండి...

ఎస్పీకి వినతి నిచ్చిన లోక్‌సత్తా

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: జిల్లాలో పెచ్చుమీరిపోతున్న గంజాయి అమ్మకాలని అదుపు లోకి తీసుకువచ్చేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని లోక్సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. జిల్లాలో యువత గంజాయి మత్తులో తేలుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ దీపికను గురువారం లోక్సత్తా పార్టీ నాయకులు కలిసి తాము సేకరించి వివరాలను అందజేశారు.అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఊహించని స్థాయిలో గంజాయి అమ్మకం పెరిగిందని, దీనివల్ల జిల్లాలో ని బహిరం గంగా గంజాయిని సేవిస్తున్న వారిని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారని, గంజాయి వినియోగంకి అలవాటు పడ్డవారు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గంజాయి వినియోగంపై కేసులు పెరగటం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా ఏ రియల్ ఎస్టేట్ లే అవుట్ చూసినా వాడేసిన మద్యం సీసాలు, గంజాయి వాడిన పరికరాలు దర్శనమిస్తున్నాయని,చదువుకుంటున్న యువత కూడా గంజాయి మత్తుకి అలవాటుపడిన పరిస్థితి చూస్తే బాధ కలుగుతుందన్నారు.

ఆధునిక నిఘా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తాం

జిల్లాలో గంజాయి విక్రయాలు, సాయంత్రం పూట జరుగుతున్న వినియోగంపై పోలీసు శాఖ పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేసిందని, ఆధునిక నిఘా డ్రోన్ కెమెరాలను వినియోగించి గంజాయి అమ్మకాలు, వినియోగం అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దీపికా హామీ ఇచ్చారని భీశెట్టి తెలిపారు. ఎస్పీ ని కలసినవారిలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, పొలుపర్తి అప్పారావు, క్యాన్సర్ ఆసుపత్రి సాధన సమితి కో.కన్వీనర్ ఇప్పలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ దినోత్సవ సందర్భంగా రక్తదానం

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: రోటరీ క్లబ్ దినోత్సవం పరిష్కరించుకొని గురువారం రోటరీ క్లబ్ సెంట్రల్ విజయనగరం డిస్ట్రిక్ట్ 3020 వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మంది రక్తదాతలు స్వచ్ఛందం గా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణ గోపాల్ అగర్వాల్, సెక్రటరీ మనోజ్, క్లబ్ సర్వీసెస్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, బ్లడ్ డొనేషన్ క్యాంప్ చైర్మన్ నాగేశ్వరరావు, రోటరీ క్లబ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం అయిన రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలో నవభారత్ పౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతం అయింది. ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 21 మంది రక్తదానం చేయడానికి ముందుకు వచ్చినట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా శిబిరంలో మెట్టపల్లి యువత రాదా సక్కు పౌండ్రీష్ల లో పనిచేస్తున్న ఉద్యోగులు రక్తదానం చేసారు. విజయనగరం న్యూలైఫ్ బ్లడ్. బ్యాంకు సిబ్బంది వారు రక్తదాన స్వీకరించారు. ఈ రక్తాదాన శిబిరాన్నికి ముఖ్యఅతిథిగా చీపురుపల్లి ఎస్ఐ సన్యాసి నాయుడు, ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఉజారు హరి ఈ శిబిరాన్ని ప్రారం భించారు. సన్యాసినాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వున్న యువత రక్తదానం చేయడానికి ముందుకు రావడం మంచి విషయం, ప్రతి ఒకరు చదువుతో పాటు సామాజిక సేవలోను. పాల్గొని సమాజం కోసం పాటు పడాలని కోరారు. 18 సంవత్సరాల నిండిన యువత రక్తదానం చేయడానికి. ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో రాదా సక్కు పౌండ్రేష్ హెచ్ఆర్ హెచ్ఓడి అకిల్ కుమార్, ఆదినారాయణ మెట్టపల్లి యువత, నవభారత్ యువజన సేవ సంఘ సభ్యులు డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బి.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ పట్నాయక్

కూలీల సదుపాయాలపై ఆరా

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని జగ్గయ్యపేట కోమటి బందలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి గురువారం పరిశీలించారు. అనంతరం కూలీల మస్తర సీట్లను తనిఖీ చేశారు.అలాగే కూలీలకు త్రాగునీరు సదుపాయం, ప్రధమ చికిత్స కొరకు మందులు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మండల పరిషత్ మరియు హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ కూలీలకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణానికి కొయ్యన విరాళం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణం నిమిత్తం కొయ్యన వైకుంఠం దంపతులు రూ.10వేల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్ బోర్డు సభ్యులు ,అప్పికొండ ఆదిబాబు , దాసరి రవిశంకర్, లకు గురువారం అందించారు.

వ్యక్తి కనిపించడం లేదు

విశాలాంధ్ర-ఆనందపురం: అనందపురం మండలం గంభీరం గ్రామపంచాయతీ, బోయపాలెం గ్రామంలో నివాసముంటున్న వెంపాడ పవన్‌కుమార్(23) అవంతి కాలేజీలో ద్వితీయ సంవత్సరం ఎంబీఏ విద్యను అభ్యసిస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 21న కాలేజీకి వెళ్లి వస్తానని చెప్పి అప్పడనుండి ఇంటికి చేరుకోలేదు తండ్రి రామచంద్ర రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ ఐ శ్యామ్ సుందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్య సాధనే పరమావధిగా పనిచేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి. లక్ష్మీషా

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: గృహ నిర్మాణాల లక్ష్య సాధన పరమావధిగా పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీషా ఇంజినీరింగ్ సహాయకులకు ఉద్బోధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణం, ఇంజినీరింగ్ సహాయకులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణంలో ఇంజినీరింగ్ సహాయకుల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్రంలో చారిత్రాత్మక కార్యక్రమం జరుగుతోందని, అందులో భాగస్వాములుగా ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. పేదల గృహ నిర్మాణంలో ఇంజినీరింగ్ సహాయకుల పాత్ర ఉండటం గొప్పగా భావిస్తూ వారికి ఇళ్లు కట్టిస్తున్నామనే సంతృప్తి పొందాలని చెప్పారు. ఉద్యోగంలో మరువరాని ఘట్టంగా నిలుస్తుందని, అభిరుచి (ఫేషన్) తో పని చేయాలని ప్రేరణ కల్పించారు. అభిరుచి ఉంటే పనులు కష్టసాధ్యం కాదన్నారు. క్షేత్రస్థాయిలో అధిక సంఖ్యలో సిబ్బంది ఉన్నారని, పేదలకు గృహ నిర్మాణం జరిగి వారికి అందించాలన్నారు. లబ్దిదారులకు అందుబాటులో ఉండాలని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం పనులు చేసుకొనుటకు అవకాశం ఉన్న కాలమని, పనులు త్వరిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పైకప్పు వేయుటకు, పైకప్పు పూర్తి చేసిన ఇళ్లపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. జిల్లాలో బలిజిపేట మండలంలో 119 రూఫ్ స్థాయిలో, 51 రూఫ్ పూర్తి అయిన ఇళ్ళు ఉన్నాయని, మక్కువ మండలంలో 128 రూఫ్ స్థాయిలో, 38 రూఫ్ పూర్తి అయిన ఇళ్ళు ఉన్నాయని, కొమరాడ మండలంలో 272 రూఫ్ స్థాయిలో, 84 రూఫ్ పూర్తి అయిన ఇళ్ళు ఉన్నాయని, ఇటువంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. వచ్చే 20 రోజుల్లో పనులు శరవేగంగా సాగుటకు శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. నిర్దేశిత లక్ష్యంలో జిల్లాలో ఇప్పటికే 60శాతం పూర్తయ్యాయని చెప్పారు. సొంత స్థలాలు కలిగిన ఇళ్ళ నిర్మాణాలపై అధిక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు డేటా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. సొంత స్థలాలు కలిగిన ఇళ్ళ డేటా అప్‌డేట్‌లో జియోటాగింగ్ పక్కాగా ఉండాలని, ఎటువంటి తప్పులకు అవకాశం ఉండరాదని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, లబ్దిదారులకు ప్రేరణ కల్పించి గృహాలు సకాలంలో పూర్తి కావడానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి వారం చెల్లింపులు చేస్తున్నామని లక్ష్మీశా చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి త్వరగా నిర్మా ణాలు పూర్తి కావడానికి కృషిచేయాలని సూచించారు. మండలాల్లో గృహ నిర్మాణాల వేగం పుంజు కొనుటకు ప్రత్యేక అధికారులను నియమించాలని జేసీని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు పథకానికి సంబంధించిన వివరాలతో బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇళ్ల కాలనీలలో విద్యుత్, తాగు నీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీతానగరం మండలం కాసా పేట గ్రామం కాలనీకి రెండు రోజుల్లో విద్యుత్ అందించాలని ఆదేశించారు. ఏడాది చివరి నాటికి రాష్ట్రంలో 10 లక్షల గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే 2.82 లక్షల గృహాలు పూర్తి అయ్యాయని, 8 లక్షల గృహాలు వివిధ దశలలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. కిరణ్ కుమార్, జిల్లా. నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, మునిసిపల్ కమీషనర్లు జె. రామ అప్పలనాయుడు, హెచ్. శంకర రావు, ఎస్. సర్వేశ్వర రావు, ఎంపిడిఓ జావేద్, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

శీలక్ష్మీ గణపతి ఆలయంలో ప్రతిష్టించనున్న దేవతా విగ్రహాలకు వైభవంగా పాలాభిషేకం

వేదమంత్రాల మధ్య రెండో రోజు క్షీరాధివాసం, హోమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట దేవి జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి సహిత శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, రమాసత్యనారాయణ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం క్షీరాదివాసం, హెూమం పూజలతో పాటు ప్రతిష్టించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు ప్రత్యేకంగా పాలాభిషేకం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సంది సోమేశ్వరరావు, సర్పంచ్ జి.సంతోషికుమారి దంపతులు, పలువురు ఎం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు, మండలంలోని మాజీ ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు, మళ్ళా రామకృష్ణ మాస్టర్ దంపతులు, కర్నాట సోమునాయుడు దంపతులు, వార్డు మెంబర్ ఆదారి సూరిబాబు దంపతులు, డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్ దంపతులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ, మండల కార్యదర్శి మోపాడ మధు, ఉప కార్యదర్శి షేక్ స్వామి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా శుక్రవారం ఉదయం 7.51గంటలకు విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని ఎమ్మెల్సీ రఘురాజు కోరారు.

ఉపాధి పనులు నిర్వహించే చెరువులో.. కంకరమట్టి తవ్వకాలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో జాతీయ రహదారి పక్కన డి.గదబవలస గ్రామ సమీపంలో జోడుబందల చెరువులో ఉపాధి హామీ పనులు ఒక వైపు, జేసిపి తో కంకరమట్టి తవ్వి అక్రమంగా తరలించుకు పోవడం ఇంకో వైపు అని పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పని నిర్వహించే ఈ చెరువులో కంకర మట్టి తవ్వకాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి.రేపు కొలతలు కొలిసి ఉపాధి హామీ బిల్లులు చెల్లింపులు కూడా అదే చెరువులో చూపించాలి కదా, ఇలా మట్టి జేసిపి తో త్రవ్వి పెద్ద గుంతలుగా ఏర్పడితే జాతీయ ఉపాధి హామీ సెంట్రల్ టీమ్ వచ్చేటప్పుడు మేజెర్మెంట్లు ఏ రకంగా చూపిస్తారో తెలియని పరిస్థితి అని, ఈ చెరువులో కూలి పని చేసే వాళ్లకు ఇబ్బంది గా మారుతుంది అని, రోజుల తరబడి ఈ చెరువులో కూలీలు పని నిర్వహించు కోవచ్చు అని, ఇలా మిషన్లు పెట్టీ తవ్వేస్తే ఇంకా కూలీలకు ఎంపని దొరుకుతుందని ఉపాధి హామీ కూలీలు వాపోతు న్నారు. ఇవన్నీ తెలిసినప్పటికీ రియలస్టేట్ పేరుతో అక్రమంగా మట్టి తరలించుకుపోతున్న పెత్తందారులు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న పరిస్థితి అని పలువురు ఆరోపిస్తున్నారు.ఇవన్నీ తెలిసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహస్తున్నారు అని ప్రజలు అంటున్నారు.

ఎమ్మెల్సీ పెనుమత్సను కలిసిన వెంకటరమణ

విశాలాంధ్ర-గుర్ల: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబును నెల్లిమర్ల మండ లంలోని మొయిదలో గుర్ల మండల వ్యవసాయ సలహా మండలి అడ్వైజరీ బోర్డు సభ్యులు మంత్రి వెంకటరమణ గురువారం మర్యాద పూర్వకం గా కలిశారు. దుశ్శాలువ కప్పి సత్కరించారు. రెండవసారి ఎమ్మెల్సీ పదవి దక్కించుకోవడం తో అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో గుర్ల వైసీపీ నాయకులు చందక రమేష్, గుర్ల సోషల్ మీడియా కన్వీనర్ మంత్రి పైడి నాయుడు ఉన్నారు.

ముగిసిన శ్రీరామమందిర పునః ప్రతిష్ట ఉత్సవాలు

విశాలాంధ్ర-కొమరాడ/పార్వతీపురం: మండలంలోని దళాయిపేటగ్రామంలో గత మూడురోజులుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న శ్రీరామమందిర ప్రతిష్ఠ మహెూత్సవాలు గురువారం సీతారాముల కళ్యాణంతో ముగిశాయి. అసంఖ్యాక దేవాలయ ప్రతిష్ఠాపరులు, అగణితయజ్ఞయాగకర్త వీరఘట్టంకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు ఎస్వీఎల్ఎన్ శర్మయాజీ, అతని శిష్యబృందం ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ట ఉత్సవాలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగాయి.గురువారం ముగింపురోజున గోపూజ, పూర్ణాహుతి హోమం, కుల దేవతారాధన, కంకణదారుల దర్శనాలు, ప్రతిష్టాంగ తిరుకళ్యాణం, ఆలయంలో విగ్రహాలు ఏర్పాటు, ప్రతిబింబంద్వారా దర్శనం,సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగాయి. ఆరువేలమందికి అన్నసంతర్పణ కార్యక్రమంను నిర్వహించారు. గ్రామంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో గ్రామం కిటకిట లాడింది. కొమరాడ ఎంపిపి శెట్టి శ్యామల దంపతులు విచ్చేసి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో విగ్రహాలను చక్కగా డిజైన్ చేసిన శిల్పి పిప్పలభద్రకు చెందిన శిల్పిని కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా సత్కరించారు.

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలి : జనసేన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో జగనన్న లేఔట్లలో ఇల్లు నిర్మాణాలు చేపడు తున్న లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయల రుణం మంజూరు చేయాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. గురువారం పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీషాను ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు తదితరులు కలిసి జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలపై చర్చిం చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జనసేన ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. జగనన్న లేఔట్ లో రోడ్లు, నీరు, విద్యుత్, మురుగునీటి పారుదల కాలువలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించా లన్నారు. అలాగే ప్రభుత్వం ఇస్తున్న రూ 1.80 లక్షల రూపాయలు పునాదులుకే సరిపో వటం లేదని లబ్ధిదారులు వాపోయారన్నారు. ప్రస్తుతం పెరిగిన కూలి రేట్లు, భవన నిర్మాణ మెటీరియల్ ఇనుము, సిమెంట్, ఇసుక, రాయి, ఇటుక బెడ్డ తదితర వాటి ధరలు పెరిగిన కారణంగా ప్రభుత్వం ఇచ్చిన మొత్తం పునాదులకే సరిపోతుందన్నారు. ఇంటి నిర్మాణం పూర్తి చేయాలంటే దాదాపు 5 నుండి 6 లక్షల రూపాయలు అవసరమని లబ్ధిదారులు తమతో చెప్పారన్నారు. అందుకే లబ్ధిదారులకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ఇసుక, ఇనుము, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీకి సంబంధించి గతంలో కోసం ఎల్ల కోసం 1488 మంది రూ.25, 50లు చొప్పున డిడి రూపంలో చెల్లించారన్నారు. అందులో 768 మందికి ఇల్లు ఇచ్చారన్నారు. మిగతా 720 మందికి ఇల్లు, కానీ డబ్బులు కానీ ఎంతవరకు చెల్లించలేదన్నారు. వారికి సుమారుగా 2.30 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండి లక్ష్మీషా తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

గిరిజనుల ఇళ్ళ బిల్లును చెల్లించండి

విశాలాంధ్ర-పార్వతీపురం: మన్యం జిల్లా పిఎం కోటా, గృహకల్పనా పథకం కింద గిరిజనులకు ఇచ్చిన గృహాలకు ఇప్పటి వరకు వివిధ స్థాయి పునాది, లింటిల్ లెవల్, స్లాబ్ లెవల్ బిల్లులు చెల్లింపులు చేయాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండి డాక్టరు లక్ష్మీషాకు గిరిజన నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన అప్పటి ఐటీడిఏ పిఓగా పనిచేసి గిరిజనులకు విశేష సేవలు అందించి ప్రస్తుతం హౌసింగ్ ఎండి గా విచ్చేసిన ఆయన్ను అందరూ కలిసి వినతులు అందజేసారు.అప్పటి స్మృతులు గుర్తు చేశారు. జిల్లాల్లోని 15 మండలాల గిరిజన కుటుంబాలకు సంబంధించిన 16354 ఇల్లులకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లింపు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాల నాయకులు దుక్కసీతారాం, ఆరిక చంద్రశేఖర్, పల్ల సురేష్, కోలక గౌరమ్మ తదితరులు వినతిపత్రం అందజేశారు. పలువురు పెద్దఎత్తున తరలి వచ్చి ఎండి డాక్టరు లక్ష్మీషాను మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లాకి ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి మంజూరు చేయాలి : లోక్‌సత్తా

విశాలాంధ్ర-బొబ్బిలి: జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల కావాలని 2014 నుండి 2019 వరకూ ప్రజల తరపున లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ గారు చేసిన అలు పెరుగని పోరాటం, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పాద యాత్రలో ఇచ్చిన హామీ మేరకు, నేషనల్ మెడికల్ కమీషన్ విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలకు 2023 - 24 సంవత్సరానికి గానూ 150 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చాలా ఆనందదాయకం అని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు అన్నారు. ఈ సందర్భంగా తమ పార్టీ తరపున జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరులో ఎంతో చొరవ చూపారని, 500 కోట్ల రూపాయలు నిధులు కేటాయించి గాజుల రేగలో ఆధునిక హంగులతో, అత్యాధునిక వైద్య సదుపాయాలతో కళాశాల నిర్మాణం జరగడం అభినందనీయమని, వైద్య కళాశాల నిర్వహణ కోసం బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చెయ్యగా ఎన్ ఎమ్ సి అనుమతి పొందిన తొలి వైద్య కళాశాల మనదే కావడం శుభపరిణామం. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు ఉపయోగ పడే మంచి పని ఏ పార్టీ చేసినా లోక్ సత్తా పార్టీ అభినందిస్తుంది అన్నారు. జిల్లాలో చాలా మంది మహిళలు రొమ్ము కేన్సర్ బారిన పడి చని పోతున్నారు. ఇటీవల కేన్సర్ వ్యాధి చాప కింద నీరులా తీవ్రరూపం దాలుస్తుందని, ఈ పరిణామంలో ప్రస్తుతం జిల్లాకు ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి ఆవశ్యకత చాలా ఉందని జిల్లాలోని మంత్రులు, ఎమ్ ఎల్ ఏ లు, ఎమ్ ఎల్ సీ లు ముఖ్యమంత్రితో మాట్లాడి జిల్లాకి కేన్సర్ ఆసుపత్రి కూడా మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పెదమానాపురం, మరడాం పాఠశాలను సందర్శించిన డిఈఓ

విశాలాంధ్ర-దత్తిరాజేరు: మండల పరిధిలో గల పెద మానాపురం, మరడాం గ్రామంలో గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లను గురువారం డి ఈ ఓ లింగేశ్వరరెడ్డి సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనంను అందించాలని, మంచి విద్యను బోధించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యను అందించాలని లక్ష్యంతో ట్యాబులను పంపిణీ చేసింది. పిల్లలు అందరూ ప్రతీ రోజూ స్కూల్ కి తెచ్చుకోని దానిని వినోయోగించాలని ఉపాధ్యాయలకు తెలియజేసారు. కొంతమంది పిల్లలు ట్యాబు లు పాఠశాలకు తేక పోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు, సిబ్బంది పాల్గొన్నారు.

మరణించిన గిరిజన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి : టీడీపీ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : మరణించిన గిరిజన కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని అలాగే గాయాలు పాలైన వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్ కు వినతిపత్రం అందజేశారు. గురువారం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కురుపాం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి తోయక జగదీశ్వరి, పార్వతీపురం నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం అంటివలస రహదారి ప్రమాద భాదితులను, మృతి చెందిన కుటుంబాలను కలసి ప్రమాద వివరాలు తెలుసుకొని మరణించిన వారి కుటుంబాలను క్షతగాత్రులను జిల్లా ఆసుపత్రి పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ సుదర్శనరావు పొట్నూరు వెంకటనాయుడు, దేవకోటి వెంకట నాయుడు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు కృష్ణబాబు, టిడిపి కొమరాడ మండల నాయకులు చంద్రశేఖర్ పాత్రుడు, అరకు పార్లమెంటు తెలుగు రైతు సంఘం అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు కొమరాడ తెలుగు రైతు నాయకులు బత్తిలి శ్రీనివాసరావు, కొమరాడ మండల తెలుగుదేశం నాయకులు నీరస శ్రీనివాసరావులతో పాటు టిడిపి సీనియర్ నాయకులు కోలా బాబు, టిడిపి పార్వతీపురం పట్టణ, మండల అధ్యక్షులు గుంట్రెడ్డి రవి కుమార్, దొగ్గమోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల నుండి పలు మండలాల తెలుగుదేశం నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఢిల్లీలో ప్రజాస్వామ్యం గెలిచింది...

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ దయానంద్

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్ : ఢిల్లీ మేయర్ ఎన్నికలో ప్రజాస్వామ్యం గెలిచిందని ఆమ్ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె.దయానంద్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులు షెల్లీ ఒబెరాయ్ ఢిల్లీ మేయర్‌గా, ఆలే మహమ్మద్ ఇక్బాల్ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ గురువారం స్థానిక కన్యాకాపరమేశ్వరి కోవెల వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ కార్పొరేషన్‌లో 250 స్థానాలకు గానూ ఆమ్ ఆద్మీ పార్టీ 134 స్థానాలు గెలుచుకొని స్పష్టమైన ఆధిక్యం తెచ్చుకున్న 104 స్థానాలు గెలిచిన బీజేపీ అప్రజాస్వామ్యంగా మేయర్ పీఠం దక్కించుకునేందుకు కుట్రలకు పాల్పడిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పుతో ఎన్నిక జరగడంతో ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు. ఆప్ మేయర్ అభ్యర్థికి 150 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థికి 116 ఓట్లు మాత్రమే వచ్చాయని అన్నారు. 15 ఏళ్లుగా ఢిల్లీ కార్పొరేషన్‌ను పాలిస్తున్న బీజేపీ అవినీతిమయం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, ట్రెజరర్ పి.సురేష్, నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, సిటీయూత్ కన్వీనర్ టీవీ నర్సింహులు, గజపతినగరం బాధ్యులు కొటిపర్తి కోటేశ్వరరావు, నయీమ్, మహేష్, కిలాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ శ్రీ రమా సత్యనారాయణ స్వామివారి ఆలయ పున: ప్రతిష్ట

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : గురువారం స్థానిక గాజులరేగలో శ్రీ శ్రీ శ్రీ రమా సత్యనారాయణ స్వామివారి ఆలయం పున: ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో గౌరవ విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరయ్యారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యనారాయణ స్వామివారి కరుణా కటక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులుతో జీవించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు ఇటువంటి దేవాలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించిన డిఆర్ఓ వెంకటరావు

విశాలాంధ్ర-బెలగాం: శాసనమండలి ఎన్నికలకు వినియోగించేందుకు కలెక్టర్ కార్యాలయ వికలాంగుల స్పందన హల్ లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్ లను జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు గురువారం పరిశీలించారు. పోలింగ్ కు అవసరమైన సామాగ్రి సిద్ధం చేసే ఏర్పాట్లపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచేందుకు సెల్లార్ లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక స్ట్రాంగ్ రూం పనులను పరిశీలించారు.

పది విద్యార్థులకు ఆంగ్లభాషపై సామర్థ్యపు పోటీల వివరాలు వెల్లడి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో 12న డెల్టా ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు బొబ్బిలి లో జరగనున్న ఆంగ్లభాష సామర్థ్య పోటీ పరీక్షల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా తెర్లాం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పాపారావు, డెల్టా అధ్యక్షుడు ఏం .విజయమోహన్ రావు, సభ్యులు సత్యనారాయణ, మధు, బ్రహ్మాజీ, అనిత, గౌతమి. తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతరావుకు ఆసరాగ నిలిచిన యువత

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పెరుమాళి గ్రా మానికి చెందిన కొరగంజి అచ్యుతరావు గత కొంతకా లంగా నరాలకు సంభందించిన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అతనీ వైద్యం నిమిత్తం సుమారు 6 లక్షలు రూ. కర్చు అవుతుంది అని వైద్యులు చెప్పారు. దీంతో అరసబలగ గ్రామంకు చెందిన యువత రూ.20 వేలు సేకరించి వైద్య కర్చుల నిమిత్తం వారి కుటుంభ సభ్యులకు సర్పంచ్ సాయిరాం చేతులమీదుగా అందజేసారు.

పాడుదుమా స్వేచ్ఛాగీతానికి ముప్పది యేళ్ళ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు రాసిన "పాడుదమా స్వేచ్ఛాగీతం" అనే దేశభక్తి గీతం రచనచేసి నేటికీ ముప్పది యేండ్లు గడిచినసందర్భంగా మరియు ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో కూడా స్థానం లభించడంపట్ల నేడు (శుక్రవారం) జిల్లా గిరిజన సామాజిక భవనంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈసందర్భంగా కథారచయత గంటేడ గౌరునాయుడును సత్కారం చేస్తామని చెప్పారు. అభిమానులు, స్నేహ కళా సాహితీ సభ్యులు, సాహితీవేత్తలు అంతాపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలోదీన్ని విద్యార్థులు ఆలపించడం అందరికీ తెలిసిందే. ఈగీతాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం 9వతరగతిలో మొదటిపాఠ్యాంశంగా చేర్చి బోధన చేస్తుంది. గంటేడ గౌరు నాయుడు మాస్టారు మన్యంజిల్లాలోని కొమరాడ మండలం దళాయిపేట గ్రామానికి చెందినవాడు. గిరిజన సంక్షేమ శాఖలో మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించి ప్రస్తుతం విశ్రాంత జీవితాన్ని మన్యంజిల్లా కేంద్రంలో ఉంటూ సాహిత్య అభివృద్ధికీ నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన ఈగీతాన్ని గిరిజన సంక్షేమ పాటశాల పిల్లల కోసం సరదాగా 30ఏళ్ల క్రితం రాయగా నేడు అందరూ ఈగీతాన్ని ఆలపించడం గమనార్హం.

39

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపి అక్రమాలు ఆపాలి!

ఆర్ జేడీ ప్రతాప్ రెడ్డి, ఏయూ వీసీ పై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర-కురుపాం: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపీ సృష్టిస్తున్న అరాచకాలను వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేసారు. కురుపాంలో మాట్లాడుతూ ఓటర్లైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టబద్రులలో గందరగోళం సృష్టిస్తుందని అన్నారు. ఇటీవల రాయల సీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార వైసిపి అభ్యర్థికి మద్దతు గా విద్యాశాఖ ఆర్‌జెడి ప్రతాప రెడ్డి కర్నూలు జిల్లా ఆదోని, అనంతపురం పట్టణంలో విద్యాసంస్థల్లో ఎంఇఓ, హెచ్ఎం లను సమావేశపర్చి ఎన్నికల ప్రచారం చేస్తూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడడం ఒక ఉదాహరణ, విశాఖలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏయూ వీసీ పాల్గొనడం ఎన్నికలను అతిక్రమించడమేనని అన్నారు, తక్షణమే ఎన్నికలసంఘం ప్రతాపరెడ్డిని సస్పెండ్ చేసి విధులనుండి తప్పించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ ఆర్ జె డి ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారు. కడపలో ఒక ప్రయివేటు విద్యాసంస్థలో ఉపాధ్యాయులను ప్రలోభపరిచేందుకు గిఫ్టులు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. రెడ్డి అధికార దుర్వినియోగం ను ప్రశ్నించిన అదోనిలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న, జిల్లా అధ్య క్షుడు సోమన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షుడు సాబీర్ భాషాలతో పాటు 9 మందిపై అనంతపురం జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి కుల్లాయ స్వామితో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించి పోలీసులు అరెస్ట్‌చేయడం సిగ్గుచేటన్నారు, రాత్రిపూట సమావేశాలు నిర్వహిస్తూ, గిఫ్టులు పంపిణీ చేస్తూ అధికార దుర్వినియోగం కు పాల్పడుతున్న ప్రతాప రెడ్డిపై చర్యలు తీసుకోకుండా అడ్డగించిన విద్యార్థి నాయకులను,సిపిఐ నాయకులను తక్షణమే విడుదల చేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము,ఈ కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్,మండంగి సింగన్న, పత్రిక మోహనరావు, ఎస్.సింహాచలం,పత్రిక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.